క్లుప్తంగా

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు



అలమూరులో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

అలమూరు: తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించడంతో పాటు పని భారాన్ని తగ్గించాలని కోరుతూ జిల్లా ఐక్యవేదిక పిలుపు మేరకు గ్రామ సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో అలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి చేరుకుని తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ నినాదాలు చేశారు. గ్రామ సచివాలయ ఉద్యోగులపై ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ వివిధ రూపాల్లో తమ నిరసనలను తెలియజేస్తామని వారు తెలిపారు.

తెలంగాణ కళాశాలల అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్‌గా 'వెన్నపు'



రాజేంద్రప్రసాద్

పి.గన్నవరం: తెలంగాణ రాష్ట్ర కళాశాల విద్యాశాఖలో అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్‌గా పి.గన్నవరం మండలం ఊడిమూడి శివారు చింతావారిపేటకు చెందిన ప్రొఫెసర్ వెన్నపు రాజేంద్రప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. చింతావారిపేటలో నిరుపేద కుటుంబానికి చెందిన రాజేంద్రప్రసాద్ తెలంగాణలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్‌గా, ప్రిన్సిపల్‌గా, ప్రొఫెసర్‌గా పనిచేసి రాష్ట్ర స్థాయికి చేరుకోవడంతో గ్రామస్తులతో పాటు, నగరం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సాధనాల రమేష్ తదితరులు అభినందించారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

అయినవిల్లి: మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు టి.స్వామినాథజయచంద్ర గాంధీ అన్నారు. మండలంలోని తొత్తరమూడిలో బుధవారం మహిళ సమాఖ్య భవనంలో డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.సత్యదేవి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. స్వామినాథజయచంద్రగాంధీ మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. గ్రామాల్లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా మహిళలను గుర్తించడం కోసం అవగాహన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివరామ్, ప్రమోషన్ అధికారి వీరభద్రరావు, స్థానిక సర్పంచ్ వార జయసావిత్రి, ఏపీఎం ఎం.వెంకటేశ్వరరావు, మండల సమాఖ్య కార్యదర్శి పి.సత్యవతి, కోశాధికారి పి.ప్రశాంతి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు, మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ పీడీ, జిల్లా ఎస్ఎంఎస్ఎంఈ ప్రత్యేక అధికారి టి.జయచంద్రగాంధీ అన్నారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మహిళా వ్యాపారులకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాపారులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని సూచించారు. ఇది రుణాలు పొందానికి ఎంతో దోహదపడుతుందన్నారు. సమావేశంలో చిన్న తరహా పరిశ్రమల ప్రోత్సాహక అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి టి.శ్రీనివాస్, ఏడీ పి.శివరామప్రసాద్, ఎంపీడీఓ జి.మల్లికార్జునరావు, ఏపీఎం ఎన్.నాగవేణి, సర్పంచ్ బి.నాగమణి, ఎంపీటీసీలు పులపర్తి చిన వెంకటలక్ష్మి, కొక్కిరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవీ నమోస్తుతే..

- కిటకిటలాడిన ఆలయాలు
- అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు



అంబాజీపేటలో అన్నపూర్ణగా కన్యకాపరమేశ్వరి



తాటికాయలవారి పాలెంలో..



కొత్తపేట బోడిపాలెంలో..



పెదపట్నంలో శాకంబరిగా

మామిడికుదురు: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం పాశర్లపూడిబాడవలో కొలువుదీరిన కనకదుర్గమ్మ అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులను కనువిందు చేశారు. ఈ ఆలయంలో శత చండీయాగ సహిత లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తోరం వెంకటరమణారావు ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహిస్తున్నారు. పెదపట్నంలంకలో కొలువుదీరిన కనకదుర్గమ్మ చంద్రఘంటా అవతారంలో భక్తులకు రమణీయంగా దర్శనమిచ్చారు. పెదపట్నంలోని బాబానగర్ ఆలయంలో కనకదుర్గమ్మను పలు రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. ఈదరాడ కాలువగట్టు దుర్గమ్మ ఆలయం వద్ద లక్ష కుంకుమ ప్రత్యేక పూజలను ఘనంగా జరిపించారు. మామిడికుదురు విజయదుర్గమ్మకు స్వర్ణపుష్పాలతో విశేష అర్చన నిర్వహించారు. మొగలికుదురులోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లోని కనకదుర్గమ్మ ఆలయాల్లో ప్రత్యేక కుంకుమ పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అంబాజీపేట: స్థానిక బస్టాండ్ వద్ద వేంచేసిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు భక్తులకు అన్నపూర్ణామాత అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కాసు శ్రీనివాసరావు, గోకవరపు శివల ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. అలాగే స్థానిక పెద్ద వీధిలోని శ్యామలానగర్‌లో వేంచేసిన వీణా శ్యామలాంబ సమేత చంద్రశేఖర స్వామిని గ్రామోత్సవం నిర్వహించారు. మాచవరం శివారు కోతి వారి అగ్రహారంలో వేంచేసిన భువనేశ్వరి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పి.గన్నవరం: తాటికాయలవారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారు అన్నపూర్ణ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దాతల సాయంతో భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. అలాగే స్థానిక అంబాజీపేట-గన్నవరం రోడ్డులో శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

కొత్తపేట: శరన్నవరాత్రుల్లో భాగంగా కనకదుర్గాదేవి ఆలయాలు, నవరాత్ర పందిళ్లలో అమ్మవారిని అన్నపూర్ణాదేవి అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బోడిపాలెం విజయకనకదుర్గాదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. స్థానిక బొరుసువారిసావరం విజయ కనకదుర్గాదేవిని, ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఏనుగులమహల్ రాజ రాజేశ్వరీదేవి (శ్రీచక్రమమహామేరు యంత్రం) ఆలయం, దేవీ సెంటర్ తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అయినవిల్లి: ముక్తేశ్వరం క్షణముక్తేశ్వరస్వామి ఆలయంలో కొలువైన ముక్తికాంతమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష కుంకుమ పూజలు జరిపారు. అలాగే విలస, సిరిపల్లి, తొత్తరమూడి, నేదునూరు, పోతుకుర్రు, క్రాప, మాగం తదితర గ్రామాల్లో అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని కానుకలు, మొక్కులు చెల్లించారు.



ముక్తేశ్వరంలో ముక్తికాంతమ్మకు నిర్వహిస్తున్న కుంకుమ పూజలు

అలమూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దేవీ మండపాల్లో నెలకొల్పిన అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు నిర్వహించారు. ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో అంతటా ఆధ్యాత్మికత నెలకొంది. అలాగే భవానీ మాలధారులు ప్రదర్శించిన పడిపూజ కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

సేవాభావానికి మారుపేరు 'ఎన్‌ఎస్‌ఎస్'



కొత్తపేట డిగ్రీ కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కొత్తపేట: సేవాభావానికి మారుపేరుగా జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) నిలుస్తుందని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అన్నారు. బుధవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ బీసీహెచ్ పాపారావు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కార్యక్రమం జరిగింది. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి డాక్టర్ ప్రియాంక ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్, పీఓ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవరచుకోవాలని, అందుకు ఎన్ఎస్ఎస్ ఎంగానో దోహదపడుతుందన్నారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ స్వచ్ఛంద రక్తదానం అనేది అత్యంత మానవీయమైన, ప్రాణాలను రక్షించే గొప్ప బృహత్తరమైన కార్యక్రమం అని అన్నారు. ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమాల్లో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ బి.విజయకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం: మలికిపురం ఎంవీఎన్‌జేఎస్ ఆర్‌వీఆర్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.ఆనంద మహని, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సీహెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు సేవాగుణాన్ని అలవరచుకొని సమాజానికి మార్గదర్శకులు కావాలన్నారు. సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ ఎస్.రమేష్ బాబు మాట్లాడుతూ మొదటి ఏడాది డిగ్రీ విద్యార్థులకు జాతీయ సేవా పథకం ఉద్దేశ్యం, లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు టీవీ ఆంజనేయులు, కె.మానస, సీహెచ్ స్రవంతి, ఆర్ మనస్వీ, ఎస్.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

రాజోలు: జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) దినోత్సవాన్ని బుధవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జోగి శాంతకుమారి అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. విద్యార్థులు సేవాభావాన్ని అలవరచుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ లక్ష్యాలను వివరించారు. సంఘసేవకుడు బలభద్ర రాయుడు, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నల్లి రాజు, జె.రాజబాబు, రిసోర్స్‌పర్సన్ ఎస్.రమేష్‌బాబు, అధ్యాపకులు ఎం.అంబేడ్కర్, కె.శ్రీరాములు, పి.శ్రీనివాసరావు, బీఎస్ఎన్ నరసింహారావు, ఎం.అరుంధతి, ఎస్.శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలసిన కోఆర్డినేటర్లు



మామిడికుదురు: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పి.గన్నవరం నియోజకవర్గం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు బుధవారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. జగన్‌ను ఆయన శాలువాతో సత్కరించారు. పార్టీకి సంబంధించిన వ్యవహారాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. పార్టీ కార్యక్రమాలు బాగా చేస్తున్నారంటూ జగన్ అభినందించారని కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు చెప్పారు.



జగన్‌ను కలసిన గొల్లపల్లి, శివ కుమార్

మలికిపురం: మాజీ సీఎం వైఎస్ జగన్‌ను రాజోలు నియోజకవర్గ పార్టీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి, రాజోలు వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాటి శివకుమార్‌లు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు కలసి నియోజక వర్గంలో పార్టీ బలోపేతంపై మాట్లాడారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం

మలికిపురం: గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హాండ్స్ సంస్థ సమకూర్చిన రూ.10 వేల ఆర్థిక సాయాన్ని కిడ్నీ బాధితురాలికి అందించారు. మండలంలోని చింతలమోరిలో నల్లి ఊర్మిల గత కొన్ని రోజులుగా రెండు కిడ్నీలు పాడై డయాలసిస్‌కి వెళ్తుంది. ఆమె వైద్య ఖర్చులకు గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హ్యాండ్స్ వైస్ ప్రెసిడెంట్ గంటా శేఖర్ కుమార్తె హిమబిందు పుట్టినరోజు సందర్భంగా గ్రూపు సభ్యులు కలసి రూ.10 వేలు సమకూర్చి మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు చేతుల మీదుగా ఊర్మిళకు అందించారు. కొల్లాబత్తుల అశోక్, రాపాక చిన్ని, నల్లి ప్రసాదరావు, సలాది మూర్తి, కంకిపాటి ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

మామిడికుదురు: ఆదుర్రులోని రావిలంక నుంచి మగటపల్లి అరుంధతీపేట వరకు ఎంపీ నిధులు రూ.49.90 లక్షలతో నిర్మిచనున్న సిమెంట్ కాంక్రీట్ రోడ్డు పనులకు సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ గ్రాంటుతో ఈ రోడ్డుకు మోక్షం లభిస్తోందని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరం ఏఎంసీ డైరెక్టర్ పినిశెట్టి శేఖర్, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఓటర్ల పరిశీలన సమగ్రంగా చేయాలి

అంబాజీపేట: మండలంలో ఉన్న ఓటర్ జాబితాను పురస్కరించుకొని పరిశీలన సమగ్రంగా చేయాలని బీఎల్వోలకు తహసీల్దార్ బి.చిన్నబాబు సూచించారు. అంబాజీపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆర్ఐ కె.ఏడుకొండలు అధ్యక్షతన మండల బీఎల్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ 2002, 2025 ఓటర్ల జాబితాలను పరిశీలించి ఓటర్లను గుర్తించాలన్నారు. ఈ రెండు ఓటర్ల లిస్టులో ఎంత మంది చేరారు. అప్పట్లో ఎంత మంది ఓటర్లు ఉన్నారు వంటి వివరాలను సమగ్రంగా పరిశీలించి నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఓటర్ల పునఃపరిశీలనపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని తహసీల్దార్ సూచించారు. సమావేశంలో మండలంలోని బీఎల్వోలు పాల్గొన్నారు.

ప్రతి మహిళా విద్యావంతురాలు కావాలి



మలికిపురంలో జరిగిన శిక్షణలో పాల్గొన్న డ్వాక్రా సంఘాల మహిళలు

మలికిపురం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి మహిళా విద్యావంతురాలిగా మారాలని వలంటరీ టీచర్స్ (స్వచ్ఛంద ఉపాధ్యాయులకు అడల్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్) జిల్లా కోఆర్డినేటర్ జి.విజయ భాస్కరరావు అన్నారు. మలికిపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సెర్ప్ ద్వారా అడల్ట్ ఎడ్యుకేషన్ ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అక్షర ఆంధ్రా పథకం కింద స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్యులైన మహిళలకు అక్షరాస్యత కార్యక్రమం కోసం బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన పాల్గొని మాట్లాడుతూ మహిళలకు అక్షరాస్యతపై శిక్షణ ఇచ్చారు. మండలంలో 240 సెంటర్లలో వలంటరీ టీచర్స్ ద్వారా 2400 మందికి జీవితకాల అభ్యాసన అవగాహన ద్వారా అక్షరాస్యులుగా చేయటం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దివ్వి దుర్గాభవాని, కార్యదర్శి డి.అశ్విని, కోశాధికారి కమిడి దివ్య, ఉపాధి హామీ ఏపీవో లక్ష్మి, వెలుగు ఏపీఎం సయీద్, వలంటరీ టీచర్స్ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మొగలికుదురు శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ లెవీ



కొత్తపేటలో గర్భిణులకు సీమంతాలు

మామిడికుదురు: గర్భిణులు తగిన పౌష్టికాహారం తీసుకోవాలని నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీ డాక్టర్లు జాన్ లెవీ, మౌనిక సూచించారు. ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబం కార్యక్రమం బుధవారం మొగలికుదురు, పాశర్లపూడిలో జరిగింది. శిబిరాలను సర్పంచ్ కడి అరుణకుమారి, ఉప సర్పంచ్ తుండూరి బుజ్జి ప్రారంభించారు. మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్లు పలు సూచనలు చేశారు. మందులు అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయుర్వేద డాక్టర్ కనకదుర్గ, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

కొత్తపేట: స్వస్థ్ నారీ- సశక్త పరివార్ అభియాన్‌లో భాగంగా కొత్తపేటలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. స్థానిక బాలయోగిపేట సమీపాన ఆక్స్‌ఫర్డ్ స్కూలు ప్రాంగణంలో అవిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం సీమంతాలు జరిపారు. ఈ శిబిరాన్ని ఉప సర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్ ప్రారంభించగా కూటమి నాయకులు పాల్గొన్నారు.

అంబాజీపేట: ఆరోగ్యవంతమైన మహిళ కుటుంబానికి రక్షణగా ఉంటుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. ముక్కామల పీహెచ్‌సీ వద్ద స్వస్థ్ నారీ-సశక్త పరివార్ అభియాన్‌లో వైద్యాధికారులు కె.సుమప్రియ, టి.దివ్యశ్రీల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. చిన్నారులకు సరైన సమయంలో వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడం ద్వారా వ్యాధుల నుంచి దూరం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వనచర్ల విజయదుర్గ, సీహెచ్ఓ రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అలమూరు: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ (ఎస్ఎన్ఎస్‌పీఏ)ని విజయవంతం చేయాలని ఆలమూరు సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి ఎం.శివశంకర్ అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో బుధవారం వైద్య ఆరోగ్య, పరిపాలన శాఖ అధికారులతో సమీక్ష జరిగింది. జిల్లా వైద్య విధాన్ పరిషత్ ఆదేశాల మేరకు ఈనెల 26న ప్రత్యేక వైద్య నిపుణుల సహకారంతో స్వస్థ్ నారీ సశక్తి అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. వైద్య నిపుణులు డి.అభిలాష్, సీహెచ్ ప్రసన్న, కె.స్వర్ణలత, హెడ్‌నర్స్ కె.జగదాంబ, కె.అనూష తదితరులు పాల్గొన్నారు. మండలంలోని జొన్నాడ, మడికి-3 గ్రామ సచివాలయాల్లో బుధవారం స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ జరిగింది. ఆయా గ్రామాల సర్పంచ్‌లు కట్టా శ్రీనివాసు, యు.లక్ష్మీమానిక అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరాల్లో చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎన్.లక్ష్మీ స్నేహలత, డి.సాయికిషోర్, కె.భాగ్యశ్రీ, బి.అనంత రామకృష్ణ విచ్చేసి సేవలను అందించారు.

ప్రత్యేక వైద్య పరీక్షలు

పి.గన్నవరం: స్థానిక సీహెచ్‌సీలో స్వస్థ్ నారీ-సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా బుధవారం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 100 మంది పురుషులకు, 63 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. రక్తపోటు, సుగర్, నోరు, మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది 8 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.